క్లుప్తంగా

మూతపడ్డ టూరిస్ట్ పోలీస్ అవుట్ పోస్ట్



భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీ ఐలాండ్‌కు వచ్చే పర్యాటకుల భద్రత కోసం మూడేళ్ల కిందట ఏర్పాటు చేసిన టూరిస్ట్ పోలీస్ అవుట్ పోస్టు క్యాబిన్ ప్రస్తుతం నిరుపయోగంగా ఉంది. ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీటీడీసీ)కు చెందిన హరిత బరంపార్క్ (పున్నమి హోటల్)లో ఈ అవుట్‌పోస్టును ఏర్పాటు చేశారు. భవానీ ఐలాండ్‌లో నేరాలు, ప్రమాదాలు జరిగినా వెంటనే స్పందించి చర్యలు తీసుకునే లక్ష్యంతో ఇది ఏర్పాటైంది. పర్యాటకం పేరుతో భవానీ ఐలాండ్‌కు వచ్చి పోయే వారిలో అనుమానాస్పద వ్యక్తులను గుర్తించడం, లగేజీని తనిఖీ చేయడం, విచారించడం చేస్తుండేవారు. కొన్నాళ్లు పోలీసులు హడావుడి చేశారు. ఆ తర్వాత ఎంత అట్టహాసంగా ప్రారంభించారో అంతే గుట్టుచప్పుడు కాకుండా మూసి వేశారు.

కనకదుర్గ నగర్ వద్ద అన్నదానం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ప్రముఖ ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావు పుట్టిన రోజును పురస్కరించుకుని శనివారం కనకదుర్గ నగర్ వద్ద అన్నదానం చేశారు. చాగంటి కోటేశ్వరరావు సత్సంగ సేవా బృందం ఆధ్వర్యంలో విజయేశ్వరస్వామి వారి ఆలయం సమీపంలోని గోశాల వద్ద పేదలకు అన్నదానం చేశారు. తొలుత గోశాలలో గోపూజ, సత్యనారాయణ స్వామి వారికి సహస్ర తులసీ దళ ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించిన అనంతరం అమ్మవారి భక్తులు, యాత్రికులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. సేవా బృందం సభ్యులు పాల్గొన్నారు.

నేడు యుగంధరాచార్యకు పురస్కారం ప్రదానం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జ్ఞానపీఠ్ అవార్డ్ గ్రహీత, కళాప్రపూర్ణ డాక్టర్ రావూరి భరద్వాజ పురస్కారాన్ని పద్యకవి కూరపాటి పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గానుగుల యుగంధరాచార్యకు ప్రదానం చేయనున్నట్లు ఏపీ రావూరి భరద్వాజ పురస్కార కమిటీ కార్యదర్శి కొసూరి రాజశేఖర్ తెలిపారు. రావూరి భరద్వాజ 98వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం అటల్ బిహారీ వాజపేయ్ విజ్ఞాన కేంద్రం రామ్మోహన్ గ్రంథాలయం ప్రాంగణంలో పురస్కార ప్రదానోత్సవం జరుగుతుందన్నారు. డాక్టర్ గానుగుల యుగంధరాచార్య 21 శతకాలను రచించారని చెప్పారు.

స్థాయీ సంఘ సభ్యుల ఎన్నికలకు నామినేషన్



భవానీపురం(విజయవాడపశ్చిమ): నగర పాలక సంస్థ స్థాయీ సంఘ సభ్యుల ఎన్నికలకు శనివారం మధ్యాహ్నం ఉద్దంటి సునీత (1వ డివిజన్), అలంపూరు విజయలక్ష్మి (62వ డివిజన్) తమ నామినేషన్లను ఎన్నికల నిర్వహణ అధికారికి అందజేశారు. వారితోపాటు వైఎస్సార్‌సీపీ ఫ్లోర్ లీడర్ సత్యనారాయణ ఉన్నారు.

కల్యాణోత్సవాలు ప్రారంభం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం (కొత్త గుళ్లు) ప్రాంగణంలోని రుక్మాబాయి సమేత పాండురంగస్వామి వారి కల్యాణోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఉదయం రుక్మాబాయి సమేత పాండురంగస్వామి వారి మూలమూర్తులకు పంచామృత తిరుమంజనం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వివిధ ఫల, పుష్ప సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. ఆలయంలో కొలువైన సంతాన వేణుగోపాలస్వామి వారికి కూడా తిరుమంజన కార్యక్రమం జరిగింది. అనంతరం స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించి నూతన వస్త్రాలను సమర్పించారు. స్వామి వారిని పెండ్లికుమారునిగా, అమ్మవారిని పెండ్లికుమార్తెగా అలంకరించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఊంజల్ సేవ నిర్వహించారు. ఆలయంలో భజన భక్త బృందం ఆధ్వర్యంలో సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు, కమిటీ సభ్యులు, ఉభయదాతలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం నిర్వహణను పర్యవేక్షించండి

మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర



ఐవీ ప్యాలెస్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగర పాలక సంస్థ పారిశుద్ధ్య నిర్వహణ విధానాన్ని సీసీ కెమెరాలతో పర్యవేక్షించాలని మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా శనివారం ఆయన గవర్నర్‌పేట, సీవీఆర్ కాంప్లెక్స్, సీవీఆర్ స్కూల్, పబ్లిక్ టాయిలెట్స్, బీసెంట్ రోడ్డు, అన్సారీ పార్క్, గోవిందరాజులు మార్కెట్, వీహెచ్‌ఆర్ కాంప్లెక్స్, మహంతి మార్కెట్, ఐవీ ప్యాలెస్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పాలక సంస్థకు చెందిన ఆస్తులు ఉన్న ప్రాంతాల్లో సీసీ కెమెరాలు అమర్చి వాటిల్లో పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించాలని అన్నారు. ఆయా ప్రదేశాల్లోని భవనాలకు స్ట్రక్చర్ స్టెబిలిటీ సర్టిఫికెట్లను ఇంజినీరింగ్ అధికారులు తీసుకురావాలని ఆదేశించారు. పాత భవనాల నివేదిక సమర్పించాలని, వాటి స్థానాల్లో నగర పాలక సంస్థకు ఆదాయం సమకూరే విధంగా ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. నగర పాలక సంస్థకు సంబంధించిన ఆస్తులను పరిశుభ్రంగా ఉంచాలని, కర్మల భవనాలు, కల్యాణ మండపాలను ప్రజలకు అద్దెకు ఇచ్చే సమయంలో వారికి పరిశుభ్రంగా అందించాలని చెప్పారు. అందుకోసం పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. ఎస్టేట్ అధికారులు నగర పాలక సంస్థకు వచ్చే నెలవారీ ఆదాయం కచ్చితంగా వసూలు చేయాలని, అందుకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు క్షేత్ర స్థాయిలో తిరిగి డిమాండ్‌కు తగ్గట్లుగా ఆదాయం వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కె. ప్రభుదాస్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, ఎస్టేట్ ఆఫీసర్ శ్రీధర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసరెడ్డి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబూ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్వాంటం కంప్యూటింగ్‌పై పట్టు సాధించాలి

నిట్ వరంగల్ కంప్యూటర్స్ విభాగం ఆచార్యులు ఎస్ఎన్ రాజు



ఎఫ్‌డీపీ ప్రోగ్రామ్‌లో పాల్గొన్న అధ్యాపకులతో కంప్యూటర్ రంగ నిపుణులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): క్వాంటం కంప్యూటింగ్‌పై కంప్యూటర్ రంగ అధ్యాపకులు మరింత పట్టు సాధించాలని నిట్ వరంగల్ కంప్యూటర్స్ విభాగ ఆచార్యులు డాక్టర్ ఎస్ఎన్ రాజు అన్నారు. నగరంలోని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, జేఎన్‌టీయూ కాకినాడ సంయుక్త ఆధ్వర్యంలో ఆ కళాశాల ప్రాంగణంలో క్వాంటం కంప్యూటింగ్ అల్గోరిథం అప్లికేషన్స్ అంశంపై ఐదు రోజుల పాటు జరిగిన అధ్యాపకుల శిక్షణా శిబిరం శనివారం ముగిసింది. డాక్టర్ ఎస్ఎన్ రాజు మాట్లాడుతూ ప్రపంచ వ్యాపితంగా క్వాంటం కంప్యూటింగ్ వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. అధ్యాపకులు, పరిశ్రమ నిపుణులు దీనిపై మరింత సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. క్వాంటం కంప్యూటింగ్ క్రిప్టోగ్రఫీ, కృత్రిమ మేధస్సు అనుకరణ, ఫైనాన్స్, ఇమేజ్ ప్రాసెసింగ్ తదితర అంశాలకు సంబంధించిన ఈ సాఫ్ట్‌వేర్ వినియోగంపై అధ్యాపకులు అవగాహన పెంచుకోవడం ద్వారా విద్యార్థులకు మరింత మెరుగైన బోధన చేయటానికి అవకాశం ఉంటుందని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శరవణకుమార్ మాట్లాడుతూ అధ్యాపకులను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు కళాశాల యజమాన్యం జేఎన్‌టీయూ సహకారంతో ఈ వర్క్‌షాప్‌ను నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో విట్ అమరావతి కంప్యూటర్స్ విభాగం ఆచార్యులు డాక్టర్ నీరజ్‌కుమార్ మిశ్రా తదితరులు మాట్లాడారు. కార్యక్రమాన్ని కళాశాల కంప్యూటర్స్ విభాగాధిపతి పీఎస్ శిల్పా, అధ్యాపకులు డాక్టర్ ఎస్. సురేఖ తదితరులు నిర్వహించారు.

మినీ మార్ట్‌ల పేరుతో చీటింగ్

మెడికల్ వ్యాపారి నుంచి రూ. 51.85 లక్షలు వసూలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రముఖ కంపెనీకి విజయవాడ పరిసరాల్లో మినీ మార్ట్‌లు ఏర్పాటు చేసి ఫ్రాంచైజీ ఇస్తామని మెడికల్ వ్యాపారిని మోసం చేసిన ఘటనపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. భవానీపురానికి చెందిన కేసరి సుబ్బారెడ్డి సత్యనారాయణపురంలో మెడికల్ షాపు నిర్వహిస్తున్నాడు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు సరఫరా చేసే సుబ్బారావు అనే వ్యక్తి ఈ ఏడాది మార్చి నెలలో కాణిపాకం అనిల్ అనే వ్యక్తిని పరిచయం చేశాడు. అనిల్ తాను జార్ఖండ్‌కు చెందిన లీలా మార్ట్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీకి సీఈఓనని పరిచయం చేసుకున్నాడు. రిలయన్స్, డీ మార్ట్ వంటి వాటికి ప్రావిజన్స్ సరఫరా చేస్తామని చెప్పాడు. తమ కంపెనీ విజయవాడ పరిసరాల్లో 17 మినీ మార్ట్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించిందని తెలిపాడు. ఔత్సాహికులకు ఫ్రాంచైజీలు ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. మార్ట్ రెంట్, స్టాఫ్ జీతాలు కంపెనీ భరిస్తుందని, కంపెనీకి ష్యూరిటీగా డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేస్తే స్టాక్ పంపుతామని నమ్మించాడు. స్టాక్ అమ్మిన తర్వాత కమీషన్ తీసుకుని మిగిలిన సొమ్ము చెల్లించాలని చెప్పాడు. అత్యధిక లాభాలు వస్తాయని నమ్మించాడు. అంబాపురం వద్ద ఓ మార్ట్ కు తీసుకెళ్లి ఇది ఫ్రాంచైజీ ఇచ్చామని నమ్మించాడు. నమ్మకం కుదిరిన సుబ్బారెడ్డి పలు చోట్ల మార్ట్‌లు ఏర్పాటుకు అవసరమైన భవనాలు చూశాడు. జీఎస్టీ తీసుకున్నాడు. ఫోన్ పే, బ్యాంకు , నగదు రూపంలో మొతం రూ.51.85 లక్షలు చెల్లించాడు. వారం రోజులుగా అనిల్ ఫోన్ ఎత్తడం లేదు. ఇతరులను ఆరా తీయగా వారి ఫోన్‌లు కూడా ఎత్తడం లేదని చెప్పారు. దీంతో తాను మోసపోయానని తెలుసుకున్న సుబ్బారెడ్డి భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాణిపాకం అనిల్ తనను ఏ విధంగా మోసం చేశాడో ఫిర్యాదులో వివరించాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

నగరంలో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో



కృష్ణలంక(విజయవాడతూర్పు): నగర ప్రజలకు దేశం నలుమూలల నుంచి తెచ్చిన విశిష్ట దుస్తులను అందించేందుకు బందరురోడ్డులోని శేషసాయి కల్యాణ వేదికలో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో-ఎగ్జిబిషన్ కమ్ సేల్ వస్త్ర ప్రదర్శనను నిర్వహిస్తున్నామని ఆర్గనైజర్ జయాస్ గుప్తా తెలిపారు. ఈ ప్రదర్శనలో వేలాది రకాల పట్టు, కాటన్ డిజైన్ దుస్తులు, డిజైనర్ చీరలు, బ్లౌజ్‌లు, కుర్తీలు వంటివి దేశంలోని నేత కార్మికుల ద్వారా 50 శాతం వరకు తగ్గింపుతో ఒకే చోట విక్రయిస్తున్నామని చెప్పారు. ఈ నెల 4వ తేదీన ప్రారంభమైన ఈ ప్రదర్శన 7వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటలకు ఉంటుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆటోను ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన భవానీపురం పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. గుణదలకు చెందిన అక్బర్ (37) చిట్టినగర్ కలరా హాస్పిటల్ వద్ద అద్దె ఇంట్లో ఉంటున్నాడు. పడవల రేవు వద్ద చికెన్ షాపు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో భవానీపురం సెంటర్‌లో చికెన్ సెంటర్ నడుపుతున్న తన అన్న వద్దకు వచ్చాడు. తిరిగి వెళుతూ సతీష్ అనే వ్యక్తి బైక్‌పై ఎక్కాడు. బందరు రోడ్డుకు వెళ్లి వస్తుండగా బెరం పార్క్ సమీపంలోకి రాగానే స్వాతి సెంటర్ వైపు నుంచి వస్తున్న ఆటోను ఢీకొట్టారు. ఈ ఘటనలో అక్బర్ మృతి చెందాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

ఎన్‌సీసీ అధికారి భూపాల్‌రెడ్డి

లబ్బీపేట(విజయవాడతూర్పు):విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని ఎన్‌సీసీ అధికారి సుబేదార్ బి.భూపాల్ రెడ్డి అన్నారు. గాయత్రినగర్‌లోని నలంద విద్యానికేతన్‌లో శనివారం ఇన్వెస్టిట్యూర్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాలలో క్రమశిక్షణ కోసం తరగతి వారీగా ఎన్నికైన ప్రైమరీ, సెకండరీ హెడ్‌బాయ్స్, హెడ్ గరల్స్, హౌస్ కెప్టెన్స్, వైస్ కెప్టెన్స్, క్లాస్ మోనిటర్స్, స్పోర్ట్స్ కెప్టెన్స్, కమ్యూనికేషన్ లీడర్స్‌తో తమ విధులను బాధ్యతతో నిర్వహిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాదల పద్మజ, ముఖ్యఅతిథి భూపాల్‌రెడ్డిలు నూతనంగా ఎన్నికైన విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలను అందచేశారు. ఈ సందర్భంగా భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు, తమ బాధ్యతలు తెలుసుకుని మంచి ప్రవర్తనతో నడుచుకుంటే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ మాట్లాడుతూ పాఠశాల విద్య నుంచే ప్రతి విద్యార్థి నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థుల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉండాలన్నారు. అంకితభావం, సహకారం లాంటి గుణాలను మనస్సులో నింపుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రైమరీ హెడ్ మిస్ట్రెస్ ఉషారాణి, సెకండరీ క్యాంపస్ వైస్ ప్రిన్సిపాల్ కుసుమ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా తయారీలో బీఎల్‌ఓల పాత్ర కీలకం

నార్త్ తహసీల్దార్ సూర్యారావు



బీఎల్‌వోల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సూర్యారావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నూతన ఓటర్ల జాబితా తయారీలో బూత్ లెవెల్ అధికారుల పాత్ర కీలకమని, అందుకు తగినట్లుగా విధులు నిర్వర్తించాలని విజయవాడ సెంట్రల్ అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల సహాయక అధికారి, నార్త్ తహసీల్దార్ ఎం. సూర్యారావు అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన బీఎల్‌ఓల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 264 మంది బూత్ లెవెల్ అధికారులకు ఈ నెల 11 వరకు శిక్షణ ఇస్తారని చెప్పారు. ఫారం-6, 6ఎ, 7, 8 ఓటర్ల జాబితా తయారీ, మార్పులు, చేర్పులు, మరణించిన వారు, వలస వెళ్లిన వారి ఓట్లను పరిశీలించి తుది సమాచారం అందించడంలో బీఎల్‌ఓలు కీలకంగా ఉండేలా శిక్షణ ఇవ్వాలని మాస్టర్ ట్రైనీలకు సూచించారు. మరణించినా, శాశ్వతంగా చిరునామా మారినా ఓటర్లు, పీడబ్ల్యూడీ, ఎన్‌ఆర్ఐ ఓటర్ల వివరాలను తప్పకుండా సేకరించాలని ఆదేశించారు. అందుకుగాను ఎంక్వైరీకి వెళ్లే సమయంలో ప్రజలతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలన్నారు. బూత్ లెవెల్ అధికారిగా నియమించినట్లు గుర్తింపుకార్డు, అపాయింట్‌మెంట్ లెటర్ చూపించి ఓటర్లకు పరిచయం చేసుకోవాలని సూచించారు. ప్రజలు ఇంట్లో లేకపోతే తాను వారి ఇంటికి వచ్చిన విషయాన్ని బీఎల్‌ఓ వివరాలతో కూడిన ఒక నోటీసును వారి ఇంటి తలుపుకో, గోడకో అంటించాలన్నారు.

పీటీఎం విట్నెస్ అధికారి నియామక ఉత్తర్వులు రద్దు చేయాలి



సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ మహేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఈ నెల పదో తేదీన జరుగనున్న మెగా పేరెంట్స్ సమావేశంలో ప్రధానోపాధ్యాయులు విట్నెస్ అధికారిని నియమించి వారిచే ఫొటోలు అప్‌లోడ్ చేయాలని సమగ్ర శిక్షాభియాన్ పీడీ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎ. సుందరయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి. మహేశ్వరరావును సుందరయ్య యూటీఎఫ్ నేతలతో శనివారం కలిసి వినతిపత్రం అందించారు. సుందరయ్య మాట్లాడుతూ గతంలో విజయవంతం చేసిన మెగా పేరెంట్స్ మీటింగ్‌లో లేనివిధంగా విట్నెస్ అధికారిని నియమించడాన్ని, 17 రకాల కమిటీలు ఏర్పాటు చేయడం, ఫొటోలు అప్‌లోడ్ చేయడం వంటి బోధనేతర పనులను ఉపాధ్యాయులకు అప్పగించడాన్ని ఖండిస్తున్నామన్నారు. వెంటనే ఆ ఉత్తర్వులు రద్దు చేసి, గతంలో జరిపినట్లు మెగా పేరెంట్స్ మీటింగ్ జరపాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు కె. శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై నెలలోనే ఉపాధ్యాయులతో యోగా దినోత్సవం జరపటం, మెగా పేరెంట్స్ మీటింగ్ వంటి బోధనేతర పనులను నిర్వహించడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇటువంటి పనులను పాఠశాలలో తగ్గించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమయాన్ని బోధనకే కేటాయించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

దుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పణ



సాయిబాబా మందిరం నుంచి సారె తీసుకుని బయలుదేరిన భక్తులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆషాఢ మాసం సందర్భంగా భవానీపురం టీచర్స్ కాలనీలోని శ్రీదత్త-సాయి-భరద్వాజ సత్సంగ మందిరం నుంచి పలువురు మహిళా భక్తులు దుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పించారు. శనివారం ఉదయం సారె తీసుకుని మహిళా భక్తులు కాలి నడకన ఇంద్రకీలాద్రికి చేరుకుని ప్రధాన ఆలయంలో మూల విరాట్‌ను దర్శించుకున్న అనంతరం మహా మండపంలోని ఆరవ అంతస్తులో ఉన్న ఉత్సవమూర్తికి సారె సమర్పించారు. అమ్మవారికి సమర్పించిన పసుపు, కుంకుమ, గాజులు, చలిమిడి, మిఠాయిలను ఒకరికొకరు ఇచ్చి పుచ్చుకున్నారు. వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది ఆషాఢ మాసంలో సాయిబాబా మందిరం నుంచి సారెతో బయలుదేరి కనకదుర్గమ్మకు సమర్పించి ఆ తల్లి ఆశీస్సులు తీసుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్లేనన్న భావనతో దుర్గమ్మకు సారె సమర్పిస్తున్నామని చెప్పారు.

ఆకలితో ఉన్నవారి కడుపు నింపటం ప్రతి ఒక్కరి బాధ్యత

మధురానగర్(విజయవాడసెంట్రల్):అన్నిదానాల్లో కెల్లా అన్నదానం మిన్న అని ఆకలితో ఉన్నవారి కడుపు నింపటం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని లయన్ గవర్నర్ పీఎంజేఎఫ్ వీవీపీఎస్ ఆంజనేయులు అన్నారు. రామకృష్ణాపురం దుర్గాదేవి దేవాలయం వద్ద శనివారం లయన్స్ మల్టీ సర్వీస్ ట్రస్ట్, లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఇమేజ్ ఆధ్వర్యాన లయన్స్ గవర్నర్ పిలుపు మేరకు అన్నదానం జరిగింది. ముఖ్య అతిథిగా అన్నదానంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల కడుపు నింపే విధంగా ఏడాది పొడవునా అన్నదానం చేయాలని సూచించారు. ఇప్పుడు అన్నదానం చేసిన డీఎస్ ట్రస్ట్ చైర్మన్ రామారావును అభినందించారు. మరో రెండ్రోజులు అన్నదానం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ కోశాధికారి క.మాధవీలత తెలియ చేశారు. అనంతరం భోజనాలు వడ్డించారు. లయన్ ప్రసాద్ , శ్రీనివాస రెడ్డి, జీవీఎస్ శర్మ, లయన్స్ క్యాబినెట్ సభ్యులు, ట్రస్ట్ చైర్మన్ కేవీ రామారావు, శ్రీధర్. శ్రీనివాస రావు, క్లబ్ అధ్యక్షులు పద్మజ పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన



వించిపేట(విజయవాడపశ్చిమ): స్థానిక 50వ డివిజన్ గొల్లపాలెంగట్టు జెండా చెట్టు కొండప్రాంతంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థానిక కార్పొరేటర్ బోయి సత్యబాబు శనివారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నిరుపేదలు ఎక్కువగా నివసించే గొల్లపాలెంగట్టు కొండప్రాంత వాసులు ఏ కార్యక్రమాన్ని జరుపుకోవాలన్నా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇక్కడ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం కార్పొరేషన్ కౌన్సిల్లో తీర్మానాలు చేపట్టడంతో రూ. 20 లక్ష నిధులను కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణం నిమిత్తం కార్పొరేషన్ కేటాయించిందని చెప్పారు. పనులల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరితగతిన పూర్తిచేసి స్థానికులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కోరారు. నగర పాలక సంస్థ ఏఈ శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం .రవిశంకర్, స్థానికులు నాగరాజు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి గురుపౌర్ణమి వేడుకలు



గురుపౌర్ణమి వేడుకల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పాలక మండలి సభ్యులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం హౌసింగ్ బోర్డు కాలనీ (పాతది)లోని సంకల్పసిద్ధి షిర్డీ సాయిబాబా మందిరంలో ఈ నెల 8 నుంచి గురుపౌర్ణమి వేడుకలను మూడు రోజులపాటు నిర్వహించనున్నామని మందిరం పాలక మండలి సభ్యులు తెలిపారు. శనివారం మందిరం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 8న తెల్లవారు జామున 6 గంటలకు బాబాకు క్షీరాభిషేకం, అనంతరం పాలక మండలి కోశాధికారి చందలూరి రాజశేఖర్-ఇంద్రజ్యోతి దంపతులు అఖండ జ్యోతి ప్రజ్వలన చేయడంతో వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అఖండ సాయినామ సంకీర్తన జరుగుతాయన్నారు.
9న ప్రత్యేక పూజలు, అభిషేకాలు, 10న పంచామృతాలతో అభిషేకం, పుష్పాలతో సహస్ర నామార్చన జరుగుతుంది. ఉదయం 10 గంటలకు బాబావారికి అన్నాభిషేకం, హారతి, అన్నప్రసాద వితరణ, సాయంత్రం 5 గంటలకు వీధులలో షిర్డీ సాయిబాబావారి ఊరేగింపు జరుగుతందని వివరించారు. ఈ సందర్భంగా గురుపౌర్ణమి వేడుకల పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఆగస్టు 3న బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బ్రాహ్మణ సేవా సంఘం నేతలు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 3న బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తామని సేవా సంఘం అధ్యక్షుడు కొప్పవరపు వెంకట బలరామ కృష్ణమూర్తి తెలిపారు. శనివారం సత్యనారాయణపురంలోని సేవా సంఘం కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. సత్యనారాయణపురంలోని సీతారామ కల్యాణ మండపంలో ఆగస్టు 3న ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే ఈ పరిచయ వేదికలో వధూవరులు, వారి తల్లిదండ్రులు పాల్గొనాలన్నారు. ఆసక్తి కలిగిన వారు సెల్: 98485 36386, 98481 48258 నంబర్‌లలో గాని, సత్యనారాయణపురంలోని శ్రీ జగద్గురు శృంగేరి పాదుకా క్షేత్రంలోని తమ కార్యాలయంలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం పరిచయ వేదిక కరపత్రాలను ఆవిష్కరించారు. సేవా సంఘం ప్రధాన కార్యదర్శి తణుకు రామకృష్ణ, పెద్దిబొట్ల కాశీవిశ్వనాథం, ఈమని శ్రీరామచంద్రమూర్తి, కొప్పవరపు మారుతి పాల్గొన్నారు.

వాణిజ్య పన్నుల శాఖలో బదిలీల జాతర

జేసీ, డీసీలు సైతం బదిలీ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వాణిజ్య పన్నుల శాఖకు చెందిన ఉమ్మడి కృష్ణాజిల్లాలోని ఉద్యోగులందరూ దాదాపుగా అన్ని క్యాడర్లలోనూ వందలాది మంది బదిలీ అయ్యారు. జాయింట్ కమిషనర్ స్థాయి నుంచి దిగువ స్థాయి వరకూ ఉన్న ఉద్యోగులను బదిలీ చేస్తూ ఆశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. విజయవాడ డివిజన్- 3 జాయింట్ కమిషనర్‌గా ఉన్న ఇందుకూరి హేమ అనంతపురం జిల్లాకు బదిలీ అయ్యారు. కడప జాయింట్ కమిషనర్‌గా ఉన్న జీ కల్పన విజయవాడ డివిజన్- 3కు రానున్నారు. విజయవాడ డివిజన్-1 డెప్యూటీ కమిషనర్ షేక్ జహీర్ విజయవాడ డివిజన్- 2కు బదిలీ అయ్యారు. విజయవాడ డివిజన్- 2 డెప్యూటీ కమిషనర్ వెల్లూరి పరదేశినాయుడు చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు. విజయవాడ డివిజన్- 3 డెప్యూటీ కమిషనర్ కేపీ శైలజశ్రీ ఏలూరుకు బదిలీ అయ్యారు. ఉమ్మడి జిల్లాలోని మూడు డివిజన్లలో పని చేస్తున్న డెప్యూటీ అసిస్టెంట్ కమిషనర్లు సుమారు 43 మంది వివిధ ప్రాంతాలకు బదిలీ అయ్యారు. మిగిలిన క్యాడర్లలోనూ బదిలీలు చోటు చేసుకున్నాయి. శుక్రవారం రాత్రి ఈ ఉత్తర్వులు జారీ కావటంతో శనివారం ఉదయం నుంచి ఆయా కార్యాలయాల్లో సందడి చోటు చేసుకుంది. ఎక్కడ చూసినా బదిలీపైనే చర్చ జరుగుతూ కనిపించింది. బదిలీల్లో వెళ్లడానికి ఇష్టపడిన వారు ఆపుకోవటానికి, తమకిష్టమైన ప్రాంతానికి వెళ్లడానికి పైరావీలు ప్రారంభించినట్లు తెలిసింది. ఉన్నతాధికారులకు ప్రజాప్రతినిధులతో, రాజకీయ నేతలతో సిఫారస్‌లు చేయించుకుంటున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి.

విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు



వేదికపై ఏసీపీలు, అతిథులు, స్కూల్ యాజమాన్యం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):జ్ఞానంతో తమ జట్లులను నడిపిస్తూ జయాపజయాలను స్వీకరించి ధృడసంకల్పంతో ముందుకు వెళ్లేవాడే నిజమైన లీడర్ అని.. విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవడం ఉత్తమమని పలువురు వక్తలు తెలిపారు. సింగ్‌నగర్ సెయింట్ ఆన్స్ స్కూల్‌లో 'ఇన్వెస్టిచర్ వేడుక' శనివారం ఘనంగా జరిగింది. నార్త్‌జోన్ ఏసీపీ కె.స్రవంతిరాయ్, మహిళా పోలీస్‌స్టేషన్ ఏసీపీ కె.లతాకుమారి, సౌత్ జోన్ ఏసీపీ డి.పవన్‌కుమార్, విజయవాడ సోషల్ అపోస్తలేట్ కౌన్సిలర్ ఇన్‌చార్జ్ సిస్టర్ సుగుణ ఫ్రాన్సిస్‌లు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్న వయస్సు నుంచే విద్యార్థులకు నాయకత్వ లక్షణాలను అలవర్చడం ఎంతో ముఖ్యమన్నారు. నాయకుడంటే ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా, ఎన్ని అపజయాలు కలిగినా తమ జట్టును ముందుండి నడిపించాలని చెప్పారు. మొక్కవోని దీక్షతో విజయ శిఖరాలకు చేరుకునేలా చేసేవాడే నిజమైన నాయకుడని పేర్కొన్నారు. స్కూల్స్‌లో కూడా విద్యార్థులకు చిన్ననాటి నుంచే ఇలా నాయకత్వ లక్షణాలు నేర్పించడం సంతోషంగా ఉందన్నారు. ఎన్నికైన నాయకులతో ప్రమాణ స్వీకారం చేయించారు. స్కూల్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులతో కాసేపు ఆడిపాడి సరదాగా గడిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. స్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ ఆశాజార్జ్, కరస్పాండెంట్ సిస్టర్ జెస్సీ థామస్, ఉపాధ్యాయులు హాజరయ్యారు.